08012025-DIS-04_Layout 1 1/8/2025 3:47 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వైరస్‌ను మించిన వైరల్

విశ్వ మహమ్మారిగా మారిన కరోనా సృష్టించిన బీభత్సం ఇంతా అంతా కాదు. 70 కోట్ల పైచిలుకు మంది వైరస్ బారిన పడితే అందులో ఏడు లక్షల మంది కన్నా ఎక్కువే ప్రాణాలు విడిచారు. సకల వ్యవస్థలు స్తంభించిపోయాయి. అంతటి ఘోరకలి చూసి ఉండటం వల్ల ఇప్పుడు ఏ చిన్న వైరస్ చిటుక్కుమన్నా ప్రపంచం ఉలిక్కి పడుతున్నది. తాజాగా చైనాలో బయటపడిన హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్) కలకలం సృష్టిస్తున్నది. కరోనా భయావహ జ్ఞాపకాల నీడలో ఈ సరి కొత్త వైరస్ కొంత బెదురు కలిగించడంలో ఆశ్చర్యం లేదు. కరోనా లాగే ఇదీ చైనాలో పుట్టడం, సోషల్ మీడియా ఊదరగొట్టడం ప్రస్తుత కలకలానికి కొంత కారణమని చెప్పక తప్పదు. గతవారం రోజులుగా మీడియాలో హెచ్‌ఎంపీవీ గురించిన కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. వైరస్ కన్నా వైరల్ అవుతున్న ప్రచారం ప్రమాదకరం. కరోనా పిల్లలకు ఎక్కువగా సోకకపోవడం, ప్రస్తుత వైరస్ పిల్లల్లోనే ముఖ్యంగా కనిపిస్తుండటం వంటి కారణాలు భయాలకు దారితీస్తున్నాయి.

ఇప్పటివరకు పది లోపు కేసులు, అదీ గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. చైనాలో వ్యాపించింది నిగూఢమైన, లేదా సరికొత్త వైరస్ అనే కథనాలు వివిధంగా వచ్చాయి. కానీ, ఇవేవీ నిజాలు కావని వెల్లడైంది. ఏటా శీతాకాలంలో శ్వాసకోశ వైరస్‌లు కొత్త రూపంలో బయటపడటం జరుగుతూనే ఉంటుంది. హెచ్‌ఎంపీవీ కూడా అంతేనని తెలియవస్తున్నది. ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వైరస్‌ను కొవిడ్‌తో పోల్చి చూపడం జరుగుతున్నది. ఒక చానెల్ అయితే ఏకంగా మరో మహమ్మారి అంటూ చాటింపు వేస్తున్నది. ఇదంతా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతుండటం వల్ల అనవసరమైన అందోళనకు దారితీస్తున్నది. కొవిడ్‌కు, ప్రస్తుత వైరస్‌కు మధ్య మౌలిక తేడా ఏమిటో ప్రజలు తెలుసుకుంటే ఈ పరిస్థితి ఉండనే ఉండదు. కొవిడ్ మూలాలు ఇప్పటికీ తెలియవు. అది నిజంగా కొత్త వైరస్. కాగా హెచ్ ఎంపీవీ తెలిసిన మూలాల నుంచి వచ్చిందే. పైగా అది ఆర్ఎన్ఏతో తయారైనది కాగా ప్రస్తుత వైరస్ డీఎన్ఏతో తయారైంది. అంతేకాదు, 2001 నుంచి ఈ వైరస్ వైద్య ప్రపంచానికి తెలిసిందేనని గూగుల్ సెర్చ్ చేసినా తెలిసిపోతుంది. కొత్త వైరస్ పూర్తిగా ఒకటి కంటే ఎక్కువ దేశాల్లో వ్యాపిస్తేనే దాన్ని పాండెమిక్ లేదా మహమ్మారి అంటారు.

చైనాలో పెద్ద ఎత్తున శ్వాసకోశ వ్యాధులు పెరిగినట్టు తనకు ఎలాంటి సమాచారం అందలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించడం గమనార్హం. గత ఏడాది కన్నా ఈ ఏడాది కేసులు తక్కువగా ఉన్నట్టు చైనా వ్యాధుల నియంత్రణ, నివారణ విభాగం పేర్కొనడం ఆలోచించాల్సిన విషయం. మరోవైపు సరికొత్తదీ అని ప్రచారం చేస్తున్న వైరస్ గురించి అంతర్జాతీయ మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదనేది గుర్తించాలి. హెచ్‌ఎంపీవీ గురించి భయపడిపోయి బెంగపెట్టుకోవడం కన్నా తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని వైద్య ప్రపంచం అంటున్నది. చికిత్స కంటే నివారణే ప్రధానమనేది తెలిసిందే. ఏ వైరస్ అయినా వ్యాపించే మార్గం ఒకటే. కరోనా పుణ్యమా అని జాగ్రత్తలూ తెలిసినవే. అవి సామాన్యమాన రీతిలో పాటించినా హెచ్‌ఎంపీవీ కాదు కదా, ఆ మాటకు వస్తే ఏ వైరస్ కూడా దరిచేరదు. ఈ లోగా సోషల్ మీడియా బెదరగొట్టకుండా ఉంటే చాలు.

వలువలు విప్పేసిన విద్రోహం

డాక్టర్ ఆంజనేయ గౌడ్

అన్నదాతలకు హస్తం పార్టీ ప్రభుత్వాలు చేసిన మోసాలను ఏకరువు పెట్టడమంటే 'పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడకా..' అన్నట్టు చాలా పొడవైన చరిత్రనే చెప్పుకోవాల్సి వస్తుందనే సత్యం అందరికీ తెలిసిందే. అదే చారిత్రక సంప్రదాయ ఒరవడిలో భాగంగానే, రేవంత్‌రెడ్డి సర్కార్ మంత్రి మండలి సుదీర్ఘ సమావేశంలో రైతు నెత్తిన చెయ్యేట్ల పెట్టాలో చర్చించి, నిర్ణయాలు వెల్లడించారు. విత్తనా నికి వెన్నుపోటు ఎలా పొడవాలో లోతుగా చర్చోపచర్చలు చేసి, భరోసా బాగోతాన్ని రైతులకు వినిపించారు.

ప్రజలు ఏమనుకుంటారోననే బెరుకూ లేదు, చేసిన బాసలను బలిపీఠం ఎక్కించడానికి ఈ ప్రభుత్వానికి ఏ భావోద్వేగమూ అడ్డం రావడం లేదు. అసలే ఇది కాంగ్రెస్ సర్కార్ కదా..! అందునా మోస పోవడానికి సిద్ధంగా ఉండే జనాలను, అబద్ధాలతో మోసగించడమే మా పని అని ఏనాడో కుండబద్దలు కొట్టి నట్టు తెలియజేసిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నుంచి ఏ మాట కట్టుబాటును కోరుకోగలమనీ..? అయితే ప్రభుత్వమే వ్యవసాయ రంగంలో కూడా విష ప్రయోగాలు మొదలు పెట్టడమే అందరికీ ఆవేదన కలిగిస్తున్నది. ఏడాదికి మునుపు రైతులకు ఎన్నో రంగుల కలలను చూపించిన కాంగ్రెస్ పార్టీ, నేడు పట్టపగలే వారితో చుక్కలు లెక్కపెట్టిస్తున్నది. ఏ రంగాని కైనా సర్కార్ ఏమిస్తున్నదనే దానికంటే, వాటిపై ఏ దృక్పథంతో ఉన్నదనేదే దీర్ఘకాలికంగా ఆయా రంగాల్లో ఫలితాలను ప్రభావితం చేస్తుంది. వివిధ ప్రాధాన్య రంగాల్లో ఇచ్చిన హామీల అమలు పట్ల ప్రభుత్వాల చిత్తశుద్ధి, ఆయా రంగాల్లోని వారి ఆత్మ విశ్వాసంపై ప్రభావం చూపిస్తుంది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో హామీల అమలుకు పిండ ప్రదానం చేస్తూ, ఇతరేతర పనులకు గల్లా పెట్టెను ఊపుతుండటమే అనేక సమస్యలకు కారణం అవుతున్నది. అందుకే, రైతు భరోసా కోతకు నిధుల కొరత కథ చెప్తున్న ప్రభుత్వం, మూసీ సుందరీకరణకు మాత్రం లక్ష కోట్ల పెట్టుబడికి కాలరెగరేస్తుండటమే సర్కార్ వక్రబుద్ధిని బట్టబయలు చేస్తున్నది. ఫార్మా క్లస్టర్‌ల పేరిట బలవంతపు భూ సేకరణకు వందల కోట్లు వెదజల్లేందుకు ఉవ్విళ్లూరుతున్న ప్రభుత్వం, పంటల పెట్టుబడికి పైసల లోటు స్టోరీ వినిపించడమే నీచ నైజానికి అద్దం పడుతున్నది. రైతులకు ఇచ్చిన హామీల అమలుకు చేతులు రాని ఈ ఇందిరమ్మ సర్కారే, ఫోర్త్ సిటీ పేరిట మాత్రం ఖర్చుకు కాలు దువ్వుతున్నది. ఈ చర్యల వెనుక అవగాహన లోపముందనడానికి సిక్స్టీ ఇయర్స్ ఇండస్ట్రీ హిస్టరీ చెప్పే కాంగ్రెస్ సర్కార్‌ను అనడానికి ఆస్కారమే లేదు. అర్థం చేసుకోగలిగితే, ఆ పార్టీ చరిత్రలోనే వంచనత్వం ఇమిడిపోయి ఉన్నదనే తత్వం అందరికీ బోధపడుతుంది.

ఆ విద్రోహపు ఒరవడిలోనే మొన్నటి మంత్రి మండలి సమావేశానంతరం ముఖ్యమంత్రి అలవోకగా రైతు భరోసాపై తాజా ప్రకటన చేశారు. గాంధీ కుటుంబం, ఏఐసీసీ వ్యవహారంపై పూర్తిగా అవగాహన పెంచుకున్న రేవంత్‌రెడ్డికి, తన తప్పులెన్నే సుగుణం పార్టీ పెద్దలకు ఏ కోశానా ఉండదని తెలిసిపోయింది. రాహుల్‌గాంధీ రాజ్యాంగం, రైతుల జపం కేవలం పార్టీ పూర్వ ప్రచార శైలిలో అంతర్భాగమే కానీ, ఢిల్లీ పెద్దలకు కొత్త సంప్రదాయమేమీ అలవడలేదనే వాస్తవం రేవంత్ రెడ్డికి స్పష్టంగా తెలుసు.

పిలిచినప్పుడల్లా, కష్టం కలిగినప్పుడల్లా తోడుగా వచ్చి వాలిపోతానని ఏడాది కిందట నయాగాంధీ చేసిన భావోద్వేగ ప్రసంగం ఏరు దాటేందుకే కానీ, ఎన్నికల తర్వాత ఆచరించేందుకు రాహుల్‌గాంధీకి తీరికెక్కడిది? ప్రచారానికి, ప్రచారానికి మధ్య విహారంలో మునిగితేలే రాహుల్‌గాంధీకి తెలంగాణ రైతులకు జరుగుతున్న దగా చెవికెక్కనే ఎక్కదనే సంగతి రాష్ట్ర ప్రభుత్వ పెద్దల కు తెలుసు. రాష్ట్రాలను పార్టీ రాజకీయ అవసరాలకు ఆదరువుగా మాత్రమే చూసే కాంగ్రెస్ అధిష్ఠానానికి, ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ సర్కార్‌లు ఏం వెలగబెట్టినా అడిగే ధైర్యం ఉంటుందని ఎలా ఆశించగలం..? అది తెలిసే, అడిగేవారెవ్వరూ పార్టీలో లేరనే, పాలనలో ప్రజా విశ్వాస ఘాతుకానికి సీఎం రేవంత్ రెడ్డి ఏ మాత్రం వెనకాడటం లేదు. ప్రభుత్వం తన విలువైన సమయాన్ని ఆత్రి త జనాలతో పరాచికాలాడటానికో, పాలనను చదరంగపు క్రీడలో పలె ఎత్తులు, పై ఎత్తుల ప్ర యత్నాలకో వృథా చేసుకోవడం నిజంగా బాధాకరం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి రైతాంగం పరిస్థితి, వ్యవసాయరంగంలో సంక్షోభ స్థితి మది లో మెదిలితే, ఏ పాలకుడు ఇలా అన్నదాతలకు ఇచ్చిన హామీలపై పిల్లి మొగ్గలు వేయడు. విత్తులు నాటి, తాళేరుకోలేక, రాలిపోయే ఆ నాటి రైతాం గం దుస్థితి రేవంత్ సర్కార్‌కు కనీసం గుర్తుంటే కదా..? పాలాల్లో అడుగు పెట్టలేక, గ్రామాల్లో ఉండలేక తల్లడిల్లిన తెలంగాణ మదిలో మెదిలితేనే హృదయం ఉన్న ఎవరికైనా కళ్లు చెమర్చకుం డా ఉండవు. కానీ, సీఎం రేవంత్ మాత్రం సమైక్యాంధ్రలోనే అంతా బాగుండిందని అనగలుగుతున్నాడంటే, ఏ అవగాహన పుణికిపుచ్చుకొని ఏలుతున్నాడో సామాన్యులకూ అర్థమవుతుంది.

రాష్ట్ర ఏర్పాటుతోనే లేగదూడ తల్లి వైపు పరిగెత్తినట్టు, కేసీఆర్ ప్రభుత్వం సాగు రంగం వైపు పరుగులు పెట్టడం వెనుక ఎంత తండ్లాట ఉన్నదో కాంగ్రెస్ సర్కార్‌కు వెయ్యి జన్మలెత్తినా అర్థం కాదు. రైతుబంధు, రైతు బీమా లాంటి చారిత్రక రైతు సంక్షేమ పథకాల అమలు వెనుక పొలాలపై ఏ ఒక్క రైతు కన్నీటి చుక్క రాలిపడరాదనే మానవీయ దృక్పథం దాగి ఉన్నది.

పండేది, పండనిది, ఏ పంట వేసేది, వేసింది, లేనిది లెక్కలు తీసి, రైతులకు నానా పరీక్షలు పెట్టి పైసలు సహాయం చేసే దుర్మార్గపు దాటవేత ధోరణితో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు వ్యవహరించి ఉంటే, నేటికీ తెలంగాణ రైతాంగానికి, పాలాల్లో పరిగలేరుకునే పరిస్థితే ఉండేది. కానీ తలాతోక లేని ఆలోచనలతో పరిపాలన సాగిస్తున్న హస్తం సర్కార్, లెక్కల్లో రైతులనూ తూకమేసుకొని బేరీజు వేసుకుంటున్నది. దానివల్లనే రెండు పంటలకు రైతు భరోసాను ఎగ్గొట్టి, ఏడాది గడిచాక తీరిగ్గా కోతల స్కీమ్‌ను ముందు పెట్టింది.

భూ యజమానులు, కౌలు రైతులకు ఎకరానికి తలా రూ.15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అధికారంలోకి రాగానే అకౌంట్లలో జమ చేస్తామని నమ్మించి, తీరా నేడు రైతాంగాన్ని నోటితో చెప్పి నొసటితో కాంగ్రెస్ పాలకులు వెక్కిరించారు. ఇస్తామని ప్రకటించిన రూ.12 వేలు సైతం ఖాతాల్లో పడేదెన్నడో, అసలు పడుతుందో లేదో, పడినా ఎన్నాళ్లు పడుతుందో, ఎంతమంది రైతులకు పడుతుందో అర్థం కాని గందరగోళం అందరిలో ఏర్పడిపోయింది. ఇంతలా రైతులను సంకటస్థితిలోకి, సీతమ్మను అగ్గిలో దూకి పాతివ్రత్యం నిరూపించుకోమని అడిగినట్టు, రైతులకు పంట డిక్లరేషన్లు ఇవ్వమనే ఆంక్షలు ప్రభుత్వం పెట్టడం ఎవ్వరికైనా ఆవేదన కలిగించకమానదు.

గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా పథకాల అమల్లోనే కాదు, రైతుల కోసం వందేండ్ల ముందు చూపుతో అడుగులు వేసింది. సాగురంగం ఎలాంటి పరీక్షలెదురవ్వని పరిస్థితిని రాష్ట్రంలో స్థిరీకరించేందుకు మిషన్ కాకతీయతో పాటు, సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసింది. గతంలో గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా 75 శాతం విశ్వసనీయత కలిగిన నికర జలాల్లో తెలంగాణకు 969 టీఎంసీలను కేటాయించినా, ఏనాడూ కనీసం 400 టీఎంసీలనూ వాడుకున్నదే లేదు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్‌లను నిర్మించి శాశ్వతంగా గోదావరి జలాల గరిష్ఠ వినియోగానికి చర్యలు చేపట్టింది. ఇవేకాక గోదావరి బేసిన్‌లో ఉన్న అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను సంపూర్ణంగా వినియోగించడానికి కృషిచేసింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడంతో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం ద్వారా కృష్ణా నదిలో న్యాయమైన నీటి కేటాయింపుల సంపూర్ణ వినియోగానికి కేసీఆర్ సర్కార్ శ్రమించింది.

కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు కాళేశ్వరం, అసమర్థతకు పాలమూరు ఎత్తిపోతల బలైపోతున్నాయి. నిర్మాణాత్మక పనులు వదిలేసి వివాదాలను రాజేసి రోజులు వెళ్లదీస్తున్న సీఎం రేవంత్, పాలమూరు ప్రాజెక్టుకూ తన మామ జైపాల్‌రెడ్డి పేరున నామకరణం చేసి పిల్ల చేష్టల పనితీరును కొనసాగిస్తున్నాడు. ఆ మాటకొస్తే రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ సర్కార్‌లది నోట్లో బెల్లం కడుపులో కత్తుల తీరు అనేది చారిత్రక వాస్తవం. 2014కు ముందటి కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్‌లు కూడా రైతుల పట్ల రేవంత్‌రెడ్డి తీరునే కనబరిచాయి. రైతు డిక్లరేషన్ లాగానే ఆర్భాటంగా డాక్టర్ స్వామినాథన్ కమిషన్‌ను కేంద్రం, డాక్టర్ జయతీఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసి, వాటి నివేదికలను నీళ్ల పాలు చేసేశారు. ఇవేకాదు కోనేరు రంగారావు భూ కమిటీ, ఆత్మహత్యలపై జస్టిస్ రాంచెన్నారెడ్డి కమిషన్ ఇలా ఎన్నో నియమించి, తర్వాత నట్టేట ముంచేశా రు. ఇందిరా గాంధీ నుంచి రేవంత్‌రెడ్డి హయాం దాకా, కాంగ్రెస్ సర్కార్‌లే రైతుల పాలిట యమపాశా లు. ఈ రైతు వ్యతిరేక విధానాల నుంచి దృష్టి మళ్లించేందుకు, నడిబజారులో రేవంత్ రెడ్డి సర్కార్‌ను దోషిగా నిలబెడుతున్న కేటీఆర్‌ను అడ్డుకునేందుకు ఏసీబీ విచారణ డ్రామా నడిపిస్తున్నారు. కనీస న్యాయ సూత్రాలకు విరుద్ధంగా కేటీఆర్‌తో పాటు న్యాయవాదిని కూడా అనుమతించని కాంగ్రెస్ కుసంస్కారం హేయాతి హే యం. ఎన్ని విన్యాసాలు ప్రదర్శించినా వలువలు విప్పేసిన కాంగ్రెస్ సర్కార్ విద్రోహం బట్ట బయలైపోయింది.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

డిటెన్షన్ ఎవరి వైఫల్యం..?

ఎడమ శ్రీనివాసరెడ్డి
99499 05069

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పదేండ్ల కాలంలో అంటే 1960 కల్లా 6 నుంచి 14 ఏండ్ల మధ్య వయసు గల పిల్లలకు ఎలిమెంటరీ స్థాయి వరకు ఉచిత నిర్బంధ విద్యా విధానం అందించాలనేది రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్ 45 లక్ష్యం. ఇది నెరవేరలేదు కాబట్టి 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 21(ఏ)ను చేర్చారు. దీని ప్రకారం విద్యా హక్కు జీవించే హక్కులో భాగమైంది. దీనికి అనుగుణంగా విద్యాహక్కు చట్టాన్ని రూపొందించారు. 2010 నుంచి ఇది అమలవుతూ వస్తున్నది.

పిల్లలందరికీ 14 ఏండ్ల వయసు (8వ తరగతి) వరకు విద్య తప్పకుండా అందాలంటే ఆ స్థాయి వరకు పిల్లల విద్య ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగాలి. కాబట్టి 8వ తరగతి వరకు ఎలాంటి బోర్డు పరీక్షలు ఉండకూడదని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యారన్న కారణంగా పై తరగతులకు పంపకుండా ఉండరాదని, అంటే డిటైన్ చేయకూడదని విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 నిర్దేశిస్తుంది. దీని అర్థం పిల్లలకు పరీక్షలు ఉండకూడదని కాదు. పిల్లల్ని టీచర్లు ఎప్పటికప్పుడు నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలి. తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. అవి పిల్లలకు భారం కాకుండా ఉండాలి, ఆ స్ఫూర్తితోనే నిరంతర సమగ్ర మూల్యాంక పద్ధతిని (సీసీఈ) ప్రవేశపెట్టారు.

ఆ తర్వాత ఈసీసీఈ, నో డిటెన్షన్ విధానాలు అమలు జరుగుతున్న తీరుపై సమీక్ష కోసం అప్పటి కేంద్ర ప్రభుత్వం 2012లో హర్యానా విద్యామంత్రి గీతా బుక్కల్ అధ్యక్షతన సీఏబీఈ కమిటీని నియమించింది. ఈ కమిటీ సీసీఈని సరిగా అమలు చేయడానికి టీచర్లను సంసిద్ధం చేయాలని, ఉపాధ్యాయ విద్యను సంస్కరించాలని.. 5,8 తరగతుల వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు నిర్వహించి మళ్లీ పరీక్ష పెట్టి పై తరగతులకు పంపించాలని సిఫారసు చేసింది. కానీ ప్రథమ్ వారి ఏఎస్ఈఆర్ సర్వే ఫలితాలు వెలువడిన ప్రతిసారీ పిల్లలు సరైన సామర్థ్యాలు పొందడం లేదనే చర్చ విస్తృతమైంది. ఈసీసీఈ విధానం, నో డిటెన్షన్ విధానాల వల్లే ఈ సమస్య పెరిగిందనే చర్చలు జరిగాయి. 2017లో జరిపిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఫలితాలు కూడా పిల్లలకు స్థాయి సంబంధిత సామర్థ్యాలు లేవని తేల్చింది. దీంతో నో డిటెన్షన్, సీసీఈ విధానాల వల్ల పిల్లలు వార్షిక పరీక్ష పరీక్షల్లో ఫెయిలైన పై తరగతులకు వెళ్తున్నారని, దీని వల్ల చదువుపై వారిలో శ్రద్ధ లోపించిందని, టీచర్లకు జవాబుదారీతనం లేకుండా పోయిందనే వాదనలు తెరపైకి వచ్చాయి. దీంతో 2019లో విద్యాహక్కు చట్టానికి సవరణ చేసి 5,8 తరగతుల వార్షిక పరీక్ష ఫలితాల ఆధారంగా డిటెన్షన్ విధానాన్ని అమలు చేసే వెసులుబాటు కల్పించారు. అయితే, ఈ డిటెన్షన్ విధానం అమలు చేయడంలో రాష్ట్రాలకు స్వేచ్ఛను ఇచ్చారు. దీంతో ఈ విధానాన్ని కొన్ని రాష్ట్రాలు అప్పటి నుంచి అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు మాత్రం ఈ విధానాన్ని అమలు చేయడం లేదు.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అధీనంలో నడిచే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల్లో కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో ఈ విషయంపై మరోసారి చర్చ తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా పిల్లలు తమ స్థాయికి తగ్గ విషయాలను ఎందుకు నేర్చుకోలేక పోతున్నారన్నది గమనార్హం. దీనికి సరైన కారణాలను, పరిష్కారాలను వెతకాలి. ఈ అన్వేషణ కనుక సరైన రీతిలో జరిగితే డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడమా, నో చెప్పడమా? అనేవి అంతగా ముఖ్య విషయాలు కావన్న విషయం తెలుస్తుంది.

మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ విద్యలో జరిగిన ప్రైవేటీకరణ కారణంగా లాభార్జన లక్ష్యంతో నడిచే ప్రైవేటు ఉపాధ్యాయ విద్యాసంస్థలు ఎక్కువయ్యాయి. ఇవి సర్టిఫికెట్లను అమ్ముకునే షాపులుగా మారాయని స్వయానా జాతీయ విద్యా విధానం 2020 ముసాయిదా కూడా పేర్కొన్నది. ఇలాంటి సంస్థల నుంచి ఉత్పన్నమైన టీచర్లు సమగ్ర నిరంతర మూల్యాంకనం స్ఫూర్తిని అర్థం చేసుకుంటారని ఆశించలేం. టీచర్ల పని పరిస్థితులను మెరుగుపరచడం, కరికులం లోడ్ లేకుండా చూడటం, శాస్త్రీయమైన వర్క్‌లోడ్ ఉండేటట్టు చూడటం, స్కూళ్ల పని గంటలను హేతుబద్ధీకరించడంలో ఇంకా వలసవాద వికారం (కలోనియల్ హేంగోవర్) కనబడుతూనే ఉంటుంది. నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ 2005 సిఫారసులను అనుసరించి స్కూల్ కరికులంలో చాలా శాస్త్రీయ మార్పులు జరిగాయి. కానీ టీచర్ల వర్క్ లోడ్ విషయంలో ఇంకా కలోనియలిజం ఛాయలను విస్మరించలేక పోతున్నాం. ఎక్కువ బోధనా గంటలు ఎక్కువ విషయాలను నేర్పుతాయనే భావనలోనే ఉన్నాం. పని పరిస్థితులను మెరుగుపరిచే భౌతిక వసతుల విషయంలో మనం ఇంకా చాలా వెనుకబడి ఉన్నాం. ఈ మౌలిక విషయాలను విస్మరించిన విద్యా తాత్వికతనే మన బ్యూరోక్రాట్స్ విశ్వసిస్తారు. వారి విశ్వాసాలకు అనుగుణంగానే విద్యావిధానాలు రూపొందుతాయి. విద్యా విధానాల రూపకల్పన నుంచి విద్యావేత్తలు దూరమై చాలా కాలమే అయింది. అందుకనే పరీక్షలు, వాటి ఫలితాలు, డిటెన్షన్ విధానాలు ప్రాధాన్యం పొందుతూ ఉన్నాయి.

పిల్లలు ఫెయిల్ అవడం అంటూ ఉండదు, వాళ్లు ఫెయిల్ చేయబడుతారు అని ఎన్‌సీఈఆర్‌టీ మాజీ ప్రొఫెసర్ కృష్ణకుమార్ ఒక సందర్భంలో అన్న మాటలను గుర్తుకు తెచ్చుకోవలసిన సందర్భం మరోసారి వచ్చింది. పిల్లలకు సంబంధం లేని విషయాల వైఫల్యాన్ని వారి వైఫల్యంగా చూపించే ప్రయత్నం అన్యాయం, జీవించే హక్కులో భాగంగా గుర్తించబడిన విద్యా హక్కు సాధనలో అది అనాగరికం కూడా.

(వ్యాసకర్త: అధ్యాపకులు, కేయూ)

మధ్యభారత అటవీ ప్రాంతాలు 29 రకాల విలువైన ఖనిజాలకు, కోట్ల రూపాయల విలువైన సంపదకు పుట్టినిల్లుగా ఉన్నాయి. అది మన దేశ ప్రజలందరి సంపద. దానిపై ప్రభుత్వాలకే కాదు, అందరికీ అధికారం ఉంటుంది. కానీ, ప్రభుత్వాలు మాత్రం తమకు మాత్రమే అధికారం ఉన్నట్టు భావిస్తాయి. ఆదివాసీలకు దానిపై ఎంత హక్కు ఉంటుందో, అంతే హక్కు మనకూ ఉంటుంది. వారు పోరాడుతూ ప్రాణత్యాగం చేస్తున్నా, నాగరికత తెలిసినవారిగా మనం భయపడుతున్నాం. కానీ, ఇది సరికాదు, మనం ఆదివాసీల పక్షాన మాట్లాడుదాం. వారిపై జరుగుతున్న 'ఆపరేషన్ కగార్'ను నిలువరించేందుకు మనవంతు బాధ్యత తీసుకుందాం.

ఆదివాసీ గ్రామాలా.. పోలీస్ క్యాంపులా?

ఎన్.నారాయణరావు

ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థిక సంక్షోభాలకు పరిష్కారంగా మనలాంటి మూడవ ప్రపంచ దేశాల్లో ఉన్న విలువైన ఖనిజ సంపద సామ్రాజ్యవాదుల దృష్టిలో పడింది. సామ్రాజ్యవాదం అంటేనే పెట్టుబడిదారీ అత్యున్నత దశ. ఎంత ప్రజాస్వామిక దేశమైనప్పటికీ కంపెనీల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలుగా, దేశ అభివృద్ధిగా ప్రచారం చేస్తూ పాలకులు కీర్తిస్తున్నారు. వాస్తవం మాత్రం అది కాదు. మన వనరులను కంపెనీలు దోపిడీ చేయకుండా అవసరం మేరకు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం వెలికితీస్తే ఆదివాసుల ప్రయోజనాలకు, జీవితాలకు ఎటువంటి భంగం కలగకుండా ఉంటుంది. కానీ, ప్రభుత్వాలు మాత్రం ఆయుధాలతో ఆదివాసులను అణచివేస్తున్నాయి. అందుకే రెండు దశాబ్దాలుగా వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి వనరులను రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి మావోయిస్టులు అండగా నిలబడుతున్నారు. దీంతో నిరాయుధ ఆదివాసీలపై 2005 నుంచి పరోక్షంగా, 2024 నుంచి 'ఆపరేషన్ కగార్' పేరుతో శత్రుదేశంతో పోరాడినట్టుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష యుద్ధం చేస్తున్నది.

కగార్ కారణంగా ఆదివాసీ గ్రామాలన్నీ పోలీసు క్యాంపులుగా మారిపోయాయి. 14 వేల నుంచి 20 వేల పారామిలటరీ బలగాలు చుట్టుముడుతున్నాయి. 2024, జనవరి నుంచి మొదలైన ఈ ఆపరేషన్‌లో ఆరేండ్ల పాప మొదలుకొని 60 ఏండ్ల వృద్ధులను సైతం విడిచిపెట్టడం లేదు. ప్రభుత్వం మాత్రం నక్సలైట్ల నుంచి గ్రామస్థులను కాపాడుతున్నామని, వారి అభివృద్ధికి, వారి భద్రతకు కృషి చేస్తున్నామని నమ్మించే ప్రయత్నం చేస్తున్నది. అయితే, ప్రభుత్వం వెనుక బడా కంపెనీలు ఉన్నాయన్న ఎత్తుగడను అర్థం చేసుకున్న ఆదివాసీలు మూడేండ్లుగా క్యాంపులకు వ్యతిరేకంగా తమ హక్కుల కోసం గాంధేయ పద్ధతిలో18 చోట్ల ఆందోళన తెలుపుతున్నారు. చివరికి ఇలాంటి శాంతి పోరాటాలపైనా కాల్పులు జరిపి (సిలింగేర్) నలుగురిని హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రచారం చేసిన ఘనత ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానిది. చివరికి ఆరు నెలల పాప మంగ్లా హత్యను కూడా వక్రీకరించారు. గతంలో ఆదివాసీ హక్కుల కార్యకర్త, టీచర్ సోనిసోరి భర్తను అక్రమ కేసుల్లో ఇరికించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో స్టేషన్‌లోనే చనిపోయాడు.

ఆదివాసీ ఉద్యమాలను అణచివేతతో నిలవరించలేమనే కదా.. కొమురంభీం పోరాట కాలంలో నిజాం ప్రభుత్వం 'హైమన్‌డార్ఫ్'తో ఒక సామాజిక శాస్త్రవేత్తను ఆదివాసీ జీవితాలపై పరిశోధన చేయించి వారి హక్కులను కాపాడే ప్రయత్నం చేసింది. కానీ నిజాం పాలనను పూర్తిగా వ్యతిరేకించే బీజేపీ ప్రభుత్వం తాను చేస్తున్నదేమిటి? ఒకవైపు మతోన్మాద హింస, మరొకవైపు బడా కంపెనీల కోసం ఆదివాసీల హననం. ఇది కచ్చితంగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు కొనసాగించే అణచివేత పాలనే తప్ప ప్రజాస్వామిక పరిపాలన కాదు. బస్తర్ జిల్లాలో ప్రస్తుతం 300 క్యాంపులు పని చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఆరులేన్ల రహదారిని